# వ్యక్తిత్వ వికాస విరజాజి పందిరి !

జుగల్ బందీలు, జంటకవులు మనకి కొత్తకాదు. అవిభాజ్య కవలల ఆలోచనా విధానం కూడా ఒకేలా వుండదు. ఈ రెండింటికీ భిన్నంగా సార్వకాలికమైన కాలమే రాయడానికి రెండు కలాలు ఒకటై కలిసిరావడం, రాయడం అపూర్వం. జంటగా కాలమ్ నిర్వహించడం అంటే కలసి పాటలు రాయడం, కలసి సంగీతం సమకూర్చడం, గొలుసు కథలు, నవలలు రాయడంలాంటిది కాదు.

పత్రికల్లో కాలమ్‌కి స్థలాభావాలుంటాయి. ఫ్రేంలుంటాయి. హద్దులు, సరిహద్దులు, పాలసీలూ వుంటాయి. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని ఒక చిన్న వ్యాసంలో ఇరువురి ఆలోచనగా విన్యాసాలను ఏకకాలంలో రంగరించి, విస్తారించి, జోడించి మెప్పించే నేర్పు, దక్షత వుంటేనే జంటకలాలు దీర్ఘకాలం 'బై లైన్'గా వుండగలుగుతాయి.

వారం వారం కాలమ్ కోసం పాఠకులు ఎదురు చూసేలా చేయడం ఆషామాషీకాదు. రాసేవారి శైలి, ముద్ర పాఠకులు కనిపెట్టగలగాలి. అలాకాకపోతే అనేక కలాలు కాలగర్భంలో కలిసిపోతాయి. కానీ కలకాలం నిలబడే కాలం రాయడానికి కాలమిస్ట్‌కి ఓ లిస్ట్ ఖచ్చితంగా తెలిసుండాలి. అది "A mind as tree as the ocean, imagination as limit less as the sky, heart as wild as the wind, and spirit as unshakable as the earth."

ఈ సునిశితత్వానికి సున్నిత హాస్యచమత్కారాలు అది 'ఆంధ్రప్రభలు' వెలిగించి, ఒకింత 'ధీర' గంభీరంగా, 'స్నేహంగా', 'ఓ చిన్నమాట' అంటూ మాటల పందిరి వేసి వ్యక్తిత్వ వికాసపు వాకిళ్ళు తెరిచారు శ్రీలక్ష్మి జ్ఞాన ప్రసూన.

వ్యక్తిత్వ పరంగా ఇద్దరూ హాస్య ప్రియులు. రోజువారీ సాధారణ సంభాషణల్లో కూడా చతురోక్తులే! నవ్వుల జల్లులే! ఆ రస వాక్ఝరే వారి కాలమ్ Value ని పెంచింది. ఏ మాత్రం వాల్యూమ్ పెరగని, తరగని (సమతూక కంఠ స్వరం) బాలన్స్‌డ్ 'టోన్' ఈ ట్విన్ కాలమిస్ట్‌లది.

రాయడం ఒక ఎత్తు, శీర్షిక పెట్టడం మరో కసరత్తు. ఈ రెంటినీ అలవోకగా నిర్వహించగలిగిన దక్షత వుంది గనకే - 'నీళ్లు, పెళ్లిళ్లు, ఆడవాళ్లు, ఇల్లు, ఉద్యోగం, విదేశీయానం, వంటలు, చదువులు, పిల్లల దగ్గర్నించి ఫిలాసఫీదాకా కరెంట్ ఎఫైర్స్‌ని టచ్ చేస్తూ ఆయా అంశాలపట్ల పఠితకు అవగాహన కలిగించి, ఒక్కోసారి మార్గ నిర్దేశం కూడా చేసే ఈ మాటల పందిరి ఉమెన్స్ పేజీకే పరిమితం కాకుండా, జెండర్ వివక్ష లేకుండా అన్ని వయసుల వారినీ అలరించింది. 2000 సం॥ నుండి 2002 దాకా (ఇకపై కూడా) నిరాఘాటంగా వీరి వ్యాస రచనా వ్యాసంగం కొనసాగుతుందంటే రీడబిలిటీకి అంతకంటే నిదర్శనం ఇంకేం కావాలి?

"తాము నత్త నడక నడుస్తూ పరుగెత్తేవాళ్ళ జుట్టు పట్టుకుని ఏమిటా పరుగు?' అని దబాయించే ప్రబుద్ధులు అన్ని రంగాల్లోనూ కనిపిస్తూ వుంటారు." అని ఆఫీసుల్లో పనిచేసే ఓ తరహావాళ్ళమీద విసుర్లు.

'మలేషియా మరమరాల పాయసం' అంటూ వంటల ప్రయోగాలు, ప్రయోజనాలు-

'ఖాళీ బుర్ర గాలికి ఎగిరిపోతే!' అని బుర్రల్ని సమస్యల్తో నింపి బరువెక్కించడం మీద సెటైర్-

'యువర్ టైమ్ స్టార్ట్స్ నౌ' అంటూ టైమ్ మానేజ్‌మెంట్ గురించి చెప్పడం-

'ఊహాల్లో అనారోగ్యం' శీర్షికన ఎదుటివారు ఏ రోగం గురించి చెప్పినా అవి తమకీ వున్నాయనుకునే ఫోబియాల తమాషాలు-

'ఎల్‌కెజి ఇంటర్వ్యూల క్రేజీ' కొసరడంలో ...' దేవుడికి నీళ్ళు నైవేద్యం పెట్టడం-

'దోస్తీ పక్కీ, షర్ట్ అప్నా అప్నా' - బారో బట్టల గుట్టు రట్టు- పనికిరాని వస్తువులపై ప్రేమ ఎందుకు? వంటి శతాధిక శీర్షికలతో బాటు సుగుణమణివంటివారి ఇంటర్వ్యూలు, దుర్గాబాయ్ దేశ్‌ముఖ్ వంటి వ్యక్తుల జీవిత రేఖలు కూడా మాటల పందిరిని అల్లుకున్న మానవ సంబంధాల మెరుపు తీగలు.

ఇద్దరు హాస్యప్రియులు - సాహిత్యాభిమానం, అభినివేశం గలవారు ప్రాణ స్నేహితులయితే, ఇద్దరూ మహిళలే అయితే, ఆ ఇద్దరి రుచులు, అభిరుచులు ఒకటే అయితే కలిసి వచ్చిన 'కాలమ్'లో అక్షరాల ఆణిముత్యాలు మాటల పందిరికి కిరణాలు. పాఠకులకు అరణాలు.

వ్యాసాల్లోని పాత్రలు, సన్నివేశాలు, సంభాషణలు, ఎంచుకున్న అంశాలు స్త్రీ పురుష ఆధిక్యతలకు అతీతంగా, అందరూ కలిసి ఆలోచించగలిగేలా ప్రయోజనాత్మకంగా పాఠక మనోరంజకంగా సాగాయి. ఆచార వ్యవహారాలు, సంస్కృతి, సంప్రదాయాలు కుటుంబంలో అందరూ కలిసి నిలబెట్టుకోవడంలోని సరదా, ఆధునికతను ఆహ్వానించాల్సిన తీరు హాయిగా చెప్తాయి వ్యాసకథలు.

మాటల పందిరి వినూత్న, విశిష్ట, వైవిధ్య భరితమైన ఎన్నెన్నో సంగతుల సమాహారం. తరాల అంతరాలను చెరిపేసే నిరంతర 'కాల' ప్రవాహం. ఎండా వాన జట్టుగా వచ్చిన వేళ సూర్యరశ్మిలో మెరిసే వానచిలుకుల అందాల్ని చిందించే మాటల పందిరిలో మూటకట్టుకోవాల్సిన ముత్యాలు ఎన్నో! ఎన్నెన్నో!!

లాతా మంగేష్కర్ ఐశ్వర్యారాయ్‌కి ప్లేబ్యాక్ పాడినట్లు టీనేజ్ కలం బలంతో కాలాతీత కాలమిస్టులుగా నిలబడి, తమ హాస్య చమత్కారాల చలువ పందిరిలోకి మనందర్నీ స్వాగతిస్తున్న నా ప్రియమైన ఫ్రెండ్స్ 'టీ' 'గాన' లచ్మీ పెసూన (టి. జ్ఞాన లక్ష్మీ ప్రసూన)లకు నా అభినందన అరవిందాలు.

**డా॥ కె.బి. .లక్ష్మి**

26-9-2003.